

ప్రైవేట్ పిల్లల వైద్యులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అనిత

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 24: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం పిల్లల వైద్యులతో డీఎంహెచ్‌వో అనిత సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వాతావరణ మార్పులతో వచ్చే వ్యాధులను వ్యాక్సిన్ ఇవ్వడం ద్వారా నివారించవచ్చని తెలిపారు. ఆసుపత్రులకు వచ్చే రోగుల వివరాలను జిల్లా కార్యాలయానికి తెలియజేయాలన్నారు. పిల్లలకు ఇచ్చే వ్యాక్సినేషన్ వివరాలను ప్రదర్శించాలన్నారు. ఆసుపత్రులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వైద్యుల వివరాలు, వైద్య సేవలు వాటి ధరల పట్టికలను ప్రదర్శించాలని లేకుంటే చర్యలు తీసుకొంటామన్నారు. డాక్టర్ అతుల్, వైద్యులు మల్లేష్, కుమార్, సురేష్‌కుమార్, పటేల్, దివ్య, అనిల్‌రెడ్డి,రఘువంశీ, రాజేష్, శ్రీనివాస్, డాక్టర్ కృపాబాయ్, ప్రోగ్రాం ఆఫీసర్ పద్మ, బుక్కా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యేనా..?



- పెండింగ్‌లో పలు పనులు
- నిధులు కేటాయిస్తేనే కదలిక
- నేడు బడ్జెట్ ప్రవేశపెట్టనున్న మంత్రి భట్టివిక్రమార్క

మంచిర్యాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ అనగానే అన్నీ వర్గాల్లో భారీ అంచనాలు ఉంటాయి. పన్నుల విధింపు, మినహాయింపులు, కొత్త పథకాల కేటాయింపులపై ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తారు.గురువారం ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టగా ఈసారి పూర్తి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు వరాలు కురుస్తాయని భావిస్తున్నారు జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పెండింగులో ఉన్న పనుల వివరాలను ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్లి నందున బడ్జెట్‌లో వాటికి స్థానం కల్పిస్తారనే నమ్మకం ప్రజల్లో నెలకొంది.

మంచిర్యాల నియోజకవర్గం:

గోదావరి సమీపంలో ఉన్న మాతా శిశు ఆస్పత్రి యేటా ముంపునకు గురవుతుండటంతో ప్రస్తుత ఆర్డీవో కార్యాలయం ఉన్న చోట కొత్తగా నిర్మించాలని ఎమ్మెల్యే ప్రేం సాగర్‌రావు ప్రతిపాదిస్తున్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపట్టవలసి ఉంది. ఇప్పటికే స్థలాన్ని వైద్య ఆరోగ్యశాఖకు అప్పగించగా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే పనులు ఊపందుకునే అవకాశాలున్నాయి. రాళ్ల వాగుపై ఉన్న లోలెవల్ వంతెన వర్షా కాలంలో ముంపునకు గురవుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాళ్లవాగుపై వంతెనకు సుమారు రూ.20 కోట్ల అంచనాతో భూమి పూజ సైతం జరిగింది. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే రంగం పేట, పవర్‌సిటీ కాలనీ, అండాళమ్మ కాలనీ వాసులు పడుతున్న కష్టాలు తీరనుంది. గత ప్రభుత్వ హయాంలో గోదావరిపై నిర్మించ తలపెట్టిన మంచిర్యాల- అంతర్గాం హైలెవల్ వంతెనకు రూ.164 కోట్లు బడ్జెట్ విడుదల కావలసి ఉంది.

చెన్నూరు నియోజకవర్గం :

కోటపల్లి మండలంలో నక్కలపల్లి లోత్‌ఒర్రె, బ్రాహ్మణపల్లి మత్తిడి వాగు, లింగన్నపేట- ఏదుల బందం మధ్యలో వంతెనల నిర్మాణం జరగాల్సి ఉంది. ఈ పనులకు ఎమ్మెల్యే గడ్డం వివేక్ హామీ ఇచ్చారు. బడ్జెట్ కేటాయిస్తే పనులు ముందుకు కదిలే అవకాశం ఉంటుంది. అలాగే పట్టణంలో పలు అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

బెల్లంపల్లి నియోజకవర్గం:

నియోజకవర్గం లోని ఆరు మండలాల్లో జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాల్సి ఉంది. బెల్లంపల్లిలో మామిడి మార్కెట్‌యార్డు అసం పూర్తిగా ఉంది. యార్డుకు రూ.1.26 కోట్లు ప్రతిపాదించగా పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేదు. పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. ఈ విషయమై ప్రస్తుత ఎమ్మెల్యే గడ్డం వినోద్ హామీఇచ్చారు. వేమనపల్లి మండలంలో బుయ్యారం నుంచి మంగెనపల్లి వరకు 5 కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణం చేపట్ట వలసి ఉంది. మండల కేంద్రం నుంచి సుంపుటం వెళ్లే దారిలో లోలెవల్ వంతెన కారణంగా ప్రాణహిత నది ఉప్పొంగినప్పుడల్లా నీట మునుగుతోంది. ఇక్కడ హై లెవల్ వంతెన నిర్మించాల్సి ఉంది. ముల్కలపేట నుంచి రాచర్లకు వెళ్లే దారిలో సంవత్సరం క్రితం వంతెన నిర్మాణం చేపట్టినప్పటికీ అప్రోచ్ రోడ్డు ప్రాణహిత బ్యాక్ వాటర్ కారణంగా యేటా కుంగుతోంది. వంతెనకు ఇరువైపులా బీటీ రోడ్లు నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



ముంపునకు గురైన మాతాశిశు ఆసుపత్రి (ఫైల్)



బెల్లంపల్లిలో వృథాగా ఉన్న మామిడి మార్కెట్ యార్డు

‘ట్రస్మా’ జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం



దామెర్ల సిద్దయ్య, ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి

ఏసీసీ, జూలై 24: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్‌అసోసియేషన్ (ట్రస్మా) జిల్లా కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా మందమర్రి లిటిల్‌ఫ్లవర్ పాఠశాలకు చెందిన దామెర్ల సిద్దయ్య, ప్రధాన కార్యదర్శిగా జన్నారం స్లేట్ హైస్కూల్‌కు చెందిన ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారిగా ఉదారి చంద్రమోహన్‌గౌడ్‌లను ఎన్నుకున్నట్లు చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్లు కేశవరెడ్డి, బుచ్చిరెడ్డిలు ప్రకటించారు. ఎన్నిక పరిశీలకులుగా యాదగిరి శేఖర్‌రావు, ఆదినాధ్‌లు వ్యవహరించారు. ఈ నెల 31న ప్రమాణ స్వీకారం ఉంటుందని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ

బెల్లంపల్లి, జూలై 24 : బెల్లంపల్లిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో బెల్లంపల్లికి చెందిన పలువురు ప్రతిభ కనబర్చారు. డి.లాస్య గోల్డ్‌మెడల్, విజయచంద్రప్రసాద్ సిల్వర్‌మెడల్‌లు సాధించారు. వీరు ఉత్తర ప్రదేశ్‌లోని ఆగ్రాలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు రామారావు బుధవారం తెలిపారు.

పారిశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహించాలి

జన్నారం, జూలై 24: వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలని డీఆర్‌డీవో కిషన్ పేర్కొన్నారు. బుధవారం జన్నారంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్‌బాల్స్ వేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని ఆదేశించారు. వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలని, ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని సూచించారు. అధికారులు, వైద్య సిబ్బంది సమన్వయంతో గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. నర్సరీని పరిశీలించి మొక్కలను సంరక్షించాలని సూచించారు. అక్కపల్లిగూడలోని ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. త్వరగా పనులను పూర్తి చేయాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఎంపీడీవో, ఏపీవో, కార్యదర్శులు ఉన్నారు.

కాలనీలలో పారిశుధ్య పనులు చేపట్టాలి

శ్రీరాంపూర్, జూలై 24: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని కార్మికుల కాలనీలలో పారిశుధ్య పనులు చేపట్టాలని బీఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్ ఒక ప్రకటనలో కోరారు. డ్రైనేజీలు, నీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. పైకప్పు ఉరుస్తున్న క్వార్టర్లకు మరమ్మతులు చేపట్టాలని, దోమల వలన పలు వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున సానిటేషన్, ఫాగింగ్ చేయాలన్నారు. సర్ఫేస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు రెయిన్ కోట్లు ఇవ్వాలన్నారు. కార్మికులకు విధులకు వెళ్లే దారుల్లో ప్రమాదకరమైన నీటి గుంతలను పూడ్చాలని, వీధి దీపాలు అన్ని పోల్స్‌కు అమర్చాలని, రాత్రివేళల్లో ప్రమాదాలను నివారించాలని కోరారు.

మున్సిపల్ ఇంజనీర్ల బదిలీలు

ఏసీసీ, జూలై 24: మంచిర్యాల మున్సిపాలిటీలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న మధుకర్‌ను పబ్లిక్ హెల్త్ సబ్ డివిజన్ మంచిర్యాల డీఈఈగా నియమించారు. మంచిర్యాల పబ్లిక్ హెల్త్ డీఈఈగా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను కరీంనగర్ మున్సిపాలిటీకి బదిలీ చేశారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో డీఈఈగా పనిచేస్తున్న మసూద్‌ఆలీని మంచిర్యాల మున్సిపాలిటీ డీఈఈగా బదిలీ చేశారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో

భీమారం, జూలై 24: భీమారం ఎంపీడీవోగా సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని, అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఎంపీడీవోను సిబ్బంది సన్మానించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో రాధ నిర్మల్‌కు బదిలీపై వెళ్లారు.

ఇండ్ల పట్టాలపై రుణాలు ఇవ్వాలి

బెల్లంపల్లి, జూలై 24: ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్ల పట్టాలకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలని భారతీయ మజ్దూర్‌సంఘ్ జిల్లా కార్యదర్శి వెంగళ రాజమల్లు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. బ్యాంకర్లు ఇండ్లపై రుణాలు ఇచ్చేలా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని పేర్కొన్నారు. బ్యాంకు రుణాలు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

ముసురు వాన

- ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద
- ఓసీల్లో ముందుకు సాగని బొగ్గు ఉత్పత్తి



బెల్లంపల్లిలో కూలిన ఇల్లు, గూడెంలో నీట మునిగిన పాత వంతెన

మంచిర్యాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముసురు వర్షం కురుస్తోంది. మంగళవారం ఉదయం నుంచి మొదలైన వర్షం బుధవారం కొనసాగుతోంది. గడిచిన 24 గంటల వ్యవధిలో 23.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. కన్నెపల్లి మండలంలో 34.2 మిల్లీమీటర్లు, వేమనపల్లి 34.0, నెన్నెల 31.7, భీమారం 28.9, జన్నారం 28.1, చెన్నూరు 26.9, దండేపల్లి 24.2, కోటపల్లి 24.1, కాసిపేట 23.4, మందమర్రి 23.1 మిల్లీమీటర్లు, భీమిని, బెల్లంపల్లి మండలాల్లో 23.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

హాజీపూర్ మండలం గుడిపేట సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 8,600 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 148 మీటర్లకు ప్రస్తుతం 145.07 మీటర్ల ఎత్తుకు నీళ్లు చేరుకున్నాయి. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 12.797 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది.

ఓసీల్లో ముందుకు సాగని బొగ్గు ఉత్పత్తి

వారం రోజుల నుంచి వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి డివిజన్‌లలోని ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు తవ్వకాలు, ఓబీ మట్టి తొలగింపు పనులు నిలిచిపోయాయి. మూడు ఏరియాల్లోని శ్రీరాంపూర్, ఇందారం, రామకృష్ణాపూర్, మందమర్రి, గోలేటి, ఖైరిగూడ ఓసీపీల్లో ఏడు రోజుల్లో దాదాపు రూ.45.5 కోట్ల విలువైన బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లగా, రూ.14 కోట్ల విలువైన ఓబీ మట్టి వెలికితీత పనులకు ఆటంకం కలుగుతోంది.

బెల్లంపల్లి: పాత బెల్లంపల్లికి చెందిన గెల్లి వంశీ ఇల్లు వర్షానికి కూలిపోయింది. ఇల్లు కూలుతున్న సమయంలో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రూ.50 వేలకు పైగా ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వ సహాయం అందించి ఆదుకోవాలని కోరాడు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పరిశీలించి ప్రభుత్వ పరంగా సహాయం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. భారీ వర్షంతో పట్టణంలోని పలు వార్డుల్లో రోడ్లపై నీరు నిలిచింది.

పరవళ్ళు తొక్కుతున్న గోదావరి

దండేపల్లి: గూడెం గోదావరి నదికి వరద ఉధృతి పెరిగింది. దీంతో గూడెం పాత లోలెవల్ వంతెన నీట మునగడంతోపాటు పుష్కరఘాట్, శనేశ్వరస్వామి ఆలయం నీట మునిగింది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు వాగులు, వంకలు ద్వారా గోదావరి నదికి వరద నీరు రావడంతో గోదావరి నది పరవళ్ల తొక్కుతోంది.

బురద రోడ్లతో ఇబ్బందులు



దండేపల్లిలో బురద రోడ్డుతో ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులు

దండేపల్లి, జూలై 24: ఏకధాటిగా కురిసిన వర్షాలకు రోడ్డు బురదమయంగా ఏర్పడి నడవడానికే కష్టంగా మారింది. దండేపల్లి మండల కేంద్రం నుంచి కర్ణపేట కడెం ప్రధాన కాలువ, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, పెండ్లీమడుగు, ఊట్ల అటవీ ప్రాంతం గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసినప్పుడల్లా కస్తూర్బా విద్యాలయ ఉపాధ్యాయులు, పొలాలకు వెళ్లే రైతులు బురద రోడ్డుతో అవస్థలు పడుతున్నారు. కడెం కాలువ వరకు బీటీ రోడ్డు వేయాలని కోరుతున్నారు.

బురద రోడ్లపై వరినాట్లు వేసి నిరసన



రోడ్డుపై వరి నాట్లు వేస్తున్న మహిళలు

నెన్నెల, జూలై 24: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కుశ్నపల్లి ఎస్సీ కాలనీ రోడ్డు చిత్తడిగా మారింది. బుధవారం మహిళలు బురదమయంగా మారిన రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన తెలిపారు. పొలానికి, రోడ్డుకు తేడా లేకుండా ఉందని, బురదలో నడవలేక పోతున్నామన్నారు. వర్షం నీరు నిలిచి వృద్ధులు, పిల్లలు జారిపడుతున్నారని పేర్కొన్నారు. యేటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఉంటుందని, అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీలో మురికి కాలువలు, సీసీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు.

గతుకుల రోడ్లతో ప్రయాణికుల అవస్థలు



కొండాపూర్ యాప వద్ద రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

కాసిపేట, జూలై 24: కురుస్తున్న వర్షాలతో రహదారులు నీటి కుంటలను తలపిస్తున్నాయి. కొండాపూర్‌యాప, కాసిపేట రహదారుల్లోని గుంతల్లో వర్షం నీరు నిలిచి నీటి కుంటలుగా మారాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండాపూర్ యాప వద్ద రోడ్డుపై నీరు అధికంగా చేరడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మందమర్రిటౌన్: మందమర్రి పట్టణంలో నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లు కోతకు గురయ్యాయి. వర్షం నీరు రోడ్లపై నుంచి ప్రవహిస్తుంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ సెంటర్‌లో వరద నీరు నిలిచిపోవడంతో పనుల నిమిత్తం వచ్చే వారు ఇబ్బందులు పడ్డారు. పాల చెట్టు ఏరియాలోని కోల్‌బెల్ట్ రోడ్డు కోతకు గురైంది. రామన్ కాలనీ రాజన్నల వాడ వద్ద రోడ్లపై వర్షం నీరు నిలిచిపోయింది. మార్కెట్ సెంటర్‌లో రోడ్లపై గుంతలు పడడంతో వర్షం నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని కటిక దుకాణాల వద్ద నుంచి కొత్తరోడ్డులోని పోచమ్మ ఆలయం వరకు ఉన్న రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురుస్తుండడంతో గుంతల్లో నీరు నిలుస్తోంది. అందులోంచి వాహనాలు వెళ్తుండడంతో ఇళ్ల ముందుకు కూర్చున్న వారి మీద బురదనీరు పడుతోంది. అధికారులు స్పందించి రహదారిని బాగు చేసి తమ కష్టాలు తప్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



మందమర్రిలో మార్కెట్‌లో గుంతలు పడిన రోడ్డు

జ్వరపీడిత గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలి



కాసిపేటలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశంలో కలెక్టర్

కాసిపేట, జూలై 24: మండలంలో జ్వరపీడిత గ్రామాలను గుర్తించి వైద్య శిబిరాలను నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ ప్రబలి ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని, అందుకే జ్వరపీడిత గ్రామాలను గుర్తించి వైద్య శిబిరాలను, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డ్రైడే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ, వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలోని అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది వనమహోత్సవం లక్ష్యాలను పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం దేవాపూర్‌లో వయోజన విద్యాశాఖ పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన సర్టిఫికెట్ల ప్రదానోత్సవం కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. మహిళల్లో అక్షరాస్యత పెంపొందడం వల్ల నవ సమాజ నిర్మాణం జరుగుతుందన్నారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. అక్షరాస్యతకు కృషి చేసిన ట్రస్టు ఉమ్మడి జిల్లా కన్వీనర్ రెడ్డిమల్ల ప్రకాష్, డీఆర్‌పీలు వెంక టేశ్వర్లు, బండ శాంకరిలను కలెక్టర్ అభినందించారు. డీపీవో వెంకటేశ్వర్‌రావు, జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం, లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతి, డీటీడీవో గంగారాం, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, తహసీల్దార్ భోజన్న, ఎంపీవో సప్దర్ ఆలీ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్: మొక్కల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భావితరాలకు మంచి వాతావరణం అందించడం బాధ్యతగా ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. నాటేందుకు అవసరమైన మొక్కలను నర్సరీల్లో సిద్ధం చేయాలని, జిల్లాలోని మున్సిపాలిటీల వారీగా మొక్కలు నాటడంపై లక్ష్యాలను నిర్దేశించామని, లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. సెప్టెంబరు 15 నాటికి బ్యాగ్స్ కన్వర్షన్‌కు మొక్కలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ప్రతి నర్సరీలో సుమారు 2 వేల వరకు వెదురు మొక్కలను పెంచాలని, వచ్చే సంవత్సరం అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దుల్లో నాటాలన్నారు. జిల్లాలో మామిడి, జామ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకొంటామన్నారు.

పాఠశాలల్లో పనులను త్వరగా పూర్తి చేయాలి

జైపూర్, జూలై 24 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని జెడ్పీ సీఈవో గణపతి పేర్కొన్నారు. బుధవారం పెగడపల్లి, ఎల్కంటి, శెట్‌పల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పను లను పరిశీలించారు. నాణ్యతగా పనులు చేపట్టాలని, సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో పాఠశాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎంపీడీవో సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పలువురు ఎస్‌ఐల బదిలీ

కోల్‌సిటీ, జూలై 24: రామగుండం కమిషనరేట్ పరిధిలో పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ సీపీ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం సీఎస్‌బీ ఎస్‌ఐగా పని చేస్తున్న డీ కిరణ్ కుమార్‌ను తాండూరు ఎస్‌హెచ్‌ఓగా, తాండూరు ఎస్‌ఐ కిరణ్‌కుమార్‌ను సీఎస్‌బీ రామగుండంకు బదిలీ చేశారు. బెల్లంపల్లి వన్‌టౌన్ పీఎస్‌లో పని చేస్తున్న సౌజన్యను మందమర్రి ఎస్‌హెచ్‌ఓగా, మందమర్రిలో పని చేస్తున్న అనూషను రామగుండం వీఆర్‌కు బదిలీ చేశారు. రామకృష్ణాపూర్‌లో ఎస్‌ఐ-2గా పని చేస్తున్న మహేందర్‌ను బెల్లంపల్లి టుటౌన్ ఎస్‌హెచ్‌ఓగా, అక్కడ పని చేస్తున్న రమేష్‌ను రామగుండం వీఆర్‌కు బదిలీ చేశారు. కొమురంభీం ఆసిఫాబాద్ తిర్యాణిలో పని చేస్తున్న సీహెచ్ రమేష్‌ను తాళ్లగురిజాల ఎస్‌హెచ్‌ఓగా, అక్కడ పని చేస్తున్న నరేష్‌ను వీఆర్‌లోకి పంపారు. ములు గు వీఆర్‌లో ఉన్న అశోక్‌ను ఘన్‌పూర్ ఎస్‌హెచ్‌ఓగా, అక్కడ పని చేస్తున్న సాంబమూర్తిని భూపాలపల్లిలోని సీసీఎస్‌కు బదిలీ చేశారు.

ఘనంగా గణపతి హోమం



గణపతి ఆలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు

నస్పూర్, జూలై 24: హౌసింగ్ బోర్డు కాలనీలోని లక్ష్మి గణపతి దేవాల యంలో సంకట హర చతుర్థి పురస్కరించుకుని బుధవారం 108 కిలో చక్కరతో మహాశర్కరాభిషేకం జరిగింది. ప్రధానార్చకులు గంగారపు వంశీ కృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేశారు. సాయంత్రం 108 కిలోల చక్కరతో అభిషేకం ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని దర్శించిన భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ అనంతరం పురవీధుల్లో స్వామి వారి పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించామని ఆలయ కమిటీ అధ్యక్షుడు రఘుపతిరావు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ జెండా గద్దెల నిర్మాణం చేపట్టాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 24: ప్రతి గ్రామంలో ఎంఆర్‌పీఎస్ జెండా గద్దెల నిర్మాణం చేపట్టాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీ కృష్ణ, మిట్టపల్లి మల్లయ్య, జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగలు పేర్కొన్నారు. బుధవారం చార్వాక హాలులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నాయకులు గ్రామంలో ఎంఆర్‌పీఎస్ జెండా గద్దెల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు పోశన్న, అంజన్న, బానయ్య, శ్రీనివాస్, శంకర్‌వర్మ , శంకర్, దశరథం, రాజలింగు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు బానిస కావద్దు

- సీఐ అల్లం నరేందర్

లక్షెట్టిపేటరూరల్, జూలై 24: యువత డ్రగ్స్‌కు బానిస కావద్దని సీఐ అల్లం నరేందర్ అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో గంజాయి,డ్రగ్స్‌కి అలవాటుపడిన పలువురు యువకులను, వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ డ్రగ్స్ వాడినా, సరఫరా చేసినా నేరం అవుతుందన్నారు. గంజాయిపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంద న్నారు. ఒకసారి గంజాయికి అలవాటు పడి కేసుల్లో ఇరుక్కుంటే ఎవరు రక్షించలేరన్నారు. పిల్లలను తల్లిదండ్రులు నిత్యం గమనిస్తూ ఉండాలని సూచించారు. యువత వ్యసనాల బారిన పడకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. లక్ష్యం కోసం పాటుపడాలని తెలిపారు. గంజాయి వాడినా, విక్రయించినట్లు సమాచారం తెలిస్తే 8712656545కి సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, జూలై 24: మండలంలోని తాడికల్ గ్రామంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన దుద్దుల రాజయ్య మోటర్ సైకిల్‌పై మానకొండూర్ వైపు వెళ్తున్నాడు. వరంగల్ వైపు వెళ్తున్న కారు తాడికల్ గ్రామ శివారులో మోటర్ సైకిల్‌పై వెళ్తున్న రాజయ్యను ఢీ కొట్టింది. దీంతో రాజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేశవపట్నం పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

మహిళపై అత్యాచారయత్నం

- ప్రతిఘటించడంతో గొంతు నులిమి హత్య

కాసిపేట, జూలై 24: దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లంబాడి తండా(డి)లో బుధవారం మధ్యాహ్నం ఓ మహిళపై అత్యాచారానికి యత్నించగా ప్రతిఘటించింది. దీంతో నిందితుడు ఆమెను గొంతు నులిమి హత్య చేశాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లంబాడి తండా (డి)కి చెందిన ఓ మహిళ (44) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తోంది. ఆమెకు వివాహమైన ఏడాదికే భర్త మృతి చెందగా రెండో వివాహం చేసుకొంది. అతడు కూడా 15 సంవత్సరాల క్రితం మృతి చెందాడు. ఆమెకు పిల్లలు లేరు. బుధవారం ఆమె ఇంట్లో ఒంటరిగా ఉండడాన్ని గమనించిన రాముగూడకు చెందిన కుడిమెత అంబారావు అత్యాచారం చేసేందుకు యత్నించాడు. ప్రతిఘటించడంతో అంబారావు ఆమె గొంతు నులిమి హత్య చేసి అక్కడి నుంచి పారిపోయాడు. అంబారావు పారిపోతుండగా గమనించిన స్థానికులు మహిళ ఇంట్లోకి వెళ్లి చూడగా ఆమె అప్పటికే మృతి చెంది ఉంది. స్థానికుల సమాచారం మేరకు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మహిళ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంజనేయులు తెలిపారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

మంచిర్యాల అర్బన్, జూలై 23: తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి కిటికీ ఫ్రేమ్‌లను దొంగిలించిన శాతరాజు రాజేష్‌ను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ బుధవారం తెలిపారు. వడ్డెర కాలనీకి చెందిన రాజేష్ జల్సాలకు డబ్బులు సరిపోక ముగ్గురు మైనర్లతో కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నాడన్నారు. ఈ నెల 20న హైటెక్‌సిటీ విశాల్‌మార్ట్ దగ్గర నిర్మాణంలో ఉన్న ఇంట్లో దొంగతనానికి పాల్పడి 30 ఇనుప కిటికీ ఫ్రేమ్‌లను ఎత్తుకుపోయారని తెలిపారు. బెల్లంపల్లి చౌరస్తాలో బుధవారం వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటోలో నలుగురు పారిపోయేందుకు యత్నించగా పట్టుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారని తెలిపారు. 30 కిటికీ ఫ్రేమ్‌లలో 21 ఫ్రేమ్‌లను స్వాధీనం చేసుకున్నామని, మిగితా వాటిని అమ్మేశారని, ఫ్రేమ్‌లను తరలిస్తున్న ఆటోను సీజ్ చేశామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

బెల్లంపల్లి(తాండూర్), జూలై 24: తాండూర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి ఫ్లైఓవర్ పై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందాడు. తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నాగ్‌పూర్ నుంచి హైద్రాబాద్‌కు వెళ్తున్న లారీని ఫ్లైవర్ బ్రిడ్జిపై వెనక నుంచి లారీ డ్రైవర్ అన్వర్ అజాగ్రత్తగా నడిపి ఢీకొట్టాడు. దీంతో లారీ ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. లారీ క్యాబిన్‌లో ఇరుకున్న అన్వర్(44) తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడు సిద్దిపేట జిల్లాకు చెందినవాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీ కేసులో నిందితులకు జైలు శిక్ష

ఏసీసీ, జూలై 24: దొంగతనం కేసులో నేరస్తులకు సంవత్సరం జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ మంచిర్యాల రెండో అదనపు జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి నిరోష బుధవారం తీర్పునిచ్చారు. హనుమాన్‌నగర్‌లో నివాసం ఉండే ట్రాఫిక్ కానిస్టేబుల్ ఇల్లెందుల రాజేశ్వర్ మోటారు సైకిల్‌ను 2021 జూలై 25న ఇంటి బయట పార్కు చేసి ఉండగా ఎత్తుకెళ్లారు. అప్పటి ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టి చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్ శ్రీనివాస్, లైజన్ ఆఫీసర్ గులాం దస్తగిరిల సహకారంతో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్ సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టి వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో జడ్జి ఇద్దరు నేరస్తులు సోయం స్వామి, ఆత్రం ప్రశాంత్‌లకు సంవత్సరం సాధారణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 2 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

సెల్‌ఫోన్‌లు అందజేత

జన్నారం, జూలై 24: మండలానికి చెందిన అజయ్‌కుమార్ గత నెల 30న ఫోన్ పోగొట్టున్నాడు. జాడి సత్యనారాయణ ఈ నెల 19న ఫోన్ పోగొట్టుకోగా జన్నారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌లను గుర్తించి బుధవారం అందజేశారు. కానిస్టేబుల్ రవి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



ఆదర్శ పాఠశాలలో సభ్యత్వం స్వీకరిస్తున్న సంఘ నాయకులు

దండేపల్లి,జూలై 24: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూటీఎస్‌తోనే కృషి చేస్తోందని సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి అన్నారు. సభ్యత్వ నమోదులో భాగంగా బుధవారం దండేపల్లి, లింగాపూర్‌తోపాటు పలు పాఠశాలల ఉపాధ్యాయులు సభ్యత్వం స్వీకరించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరంతోపాటు ఉమ్మడి సర్వీసు రూల్స్ సాధించడం సంఘ లక్ష్యమన్నారు. అర్హులైన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు ఎంఈవో, డీఈవో, జూనియర్ లెక్చరర్, డైట్ లెక్చరర్ వంటి పోస్టులు, పదోన్నతి ద్వారా పొందడానికి అవకాశం ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి సంఘం రాష్ట్ర నాయకులు సమస్యలను తీసుకువెళ్లారన్నారు. ఎస్టీటి ఉపాధ్యాయులను రిలీవ్ చేయించడానికి ఉన్నతాధికారులతో చర్చలు జరుగుతున్నాయన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోర్టు కేసులో ఆగిపోయిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు త్వరలోనే జరుగుతాయన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. మండల అధ్యక్షకార్యదర్శు రావన వేని రవి, మల్యాల మల్లేష్, సంఘం నాయకులు జనార్దన్, అప్పాల మనోహర్, నాగవర్మ, పాత రమేష్, వరలక్ష్మి, రమేష్, రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

బెల్లంపల్లి, జూలై 24: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని బుధవారం ఎంసీపీఐయూ నాయకులు బెల్లంపల్లి ఆర్డీవోకు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కల్లబొల్లి మాటలు చెప్పి గద్దెనెక్కిన ప్రభుత్వం ప్రజలకు చేసిందేమి లేదన్నారు. వృద్ధులకు రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ. 6 వేలు ఫించన్ ఇస్తామని చెప్పి మర్చిపోయిందన్నారు. ఏడు నెలలైనా హామీలను నెరవేర్చడం లేదన్నారు. యువతులకు స్కూటీలు, కల్యాణలక్ష్మి తులం బంగారం, రేషన్ కార్డుల ఊసే లేదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు. ఎంసీపీఐయూ పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, మండల కార్యదర్శి ఆరేపల్లి సతీస్‌కుమార్ పాల్గొన్నారు.

భూ సమస్యలపై ధరణి సహాయ కేంద్రం ఏర్పాటు



ధరణి సహాయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

జైపూర్, జూలై 24: ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధరణి పోర్టల్ సహాయ కేంద్రాన్ని బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వనజారెడ్డి ప్రారంభించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి భూసమస్యలున్నా మీ సేవలో దరఖాస్తు చేయకముందు తహసీల్దార్ కార్యాలయంలోని ధరణి సహాయకేంద్రాన్ని సందర్శించాలన్నారు.

భీమారం: తహసీల్దార్ కార్యాలయంలో రైతుల కోసం ధరణి హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామని తహసీల్దార్ సదానందం తెలిపారు. హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించి మాట్లాడారు. ధరణి లోని సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, జూనియర్ అసిస్టెంట్‌లు లక్ష్మణ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

కాసిపేట, జూలై 24 :ప్రజా సమస్యలపై బీజేపీ నిరంతరం పోరాటాలు చేస్తుందని జిల్లా ఉపాధ్యక్షుడు పులుగం తిరుపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను గుర్తించి బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు చేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. లక్ష్మీపూర్‌లో పాఠశాల భవనం లేక చెట్ల కింద చదువుతున్నారని, మండల కేంద్రంలో తాగునీటి సమస్య, డ్రైనేజీ సక్రమంగా లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. సమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. మండల అధ్యక్షుడు సూరం సంపత్, ప్రసన్న, బాలరాజు, అరవింద్, కిరణ్, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారం దుకాణ నిర్వాహకులపై కేసు నమోదు

మంచిర్యాల అర్బన్, జూలై 23 : పట్టణంలోని తుకారాం జ్యువెల్లర్స్ నిర్వాహకులైన వాసుదేవ్, నాందేవ్‌లపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రామక్రిష్ణాపూర్‌లోని గద్దరాగడికి చెందిన అహ్మద్ పాషా 7 నెలల క్రితం నెక్లెస్ చేసి ఇవ్వాలని 15 తులాల బంగారాన్ని వాసుదేవ్, నాందేవ్‌లకు ఇచ్చాడని, నెక్లెస్ ఇవ్వకుండా కాలం గడిపారని తెలిపారు. కొద్దిరోజుల క్రితం నుంచి దుకాణం మూసి ఉండటంతో విషయం తెలుసుకోగా వారు పారిపోయినట్లు తెలిసిందని, దీంతో బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

నస్పూర్, జూలై 24: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కె. రామారావు జన్మదినం సందర్భంగా బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం 50 మంది రక్తదానం చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు సుబ్బయ్య, కార్యదర్శి మెరుగు పవన్‌కుమార్, నాయకులు రవీందర్ రెడ్డి, అంకం నరేష్, సీపతి శ్రీనివాస్, డాక్టర్ రాజా రమేష్, శ్రీకాంత్, గుమ్మడి శ్రీనివాస్, గరిసె భీమయ్య పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. డాక్టర్ రాజా రమేష్, సుదర్శన్ గౌడ్, జాడి శ్రీనివాస్, పాల్గొన్నారు.

భీమారం: బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను నాయకులు నిర్వహించారు. కేక్ కట్ చేసిపంచి పెట్టారు. నాయకులు లాజర్,మణిదీపక్, శ్రీకాంత్, రాము, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: మాజీమంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను దేవాపూర్, కాసిపేట, కొండాపూర్ యాపలో నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. రమణారెడ్డి, చంద్రయ్య, రాంచందర్, వాసుదేవ్, లంక లక్ష్మణ్, తిరుపతి, అగ్గి సత్తయ్య పాల్గొన్నారు.

బెల్లంపల్లి: మాజీమంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. సత్యనారాయణ, షేక్ వాజిద్, సాజిత్, సత్యనారాయణరెడ్డి, ఆలీ, రాములు పాల్గొన్నారు.

జన్నారం: కేటీఆర్ జన్మదినం సందర్భంగా హైద్రాబాద్‌లో రక్తదాన శిబిరంలో జన్నారంకు చెందిన కమ్మల విజయ్‌దర్మ రక్తదానం చేశారు.

టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ రీజినల్ కోఆర్డినేటర్‌గా అరుణకుమారి



ఏసీసీ, జూలై 24: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఉమ్మడి ఆదిలాబాద్ రీజినల్ కోఆర్డినే టర్‌గా పనిచేస్తున్న కొప్పుల స్వరూపరాణిని ఖమ్మం భద్రాద్రి జోన్ జోనల్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. స్వరూపరాణి స్థానంలో కాళేశ్వరం జోన్ 1 జోనల్ అధికారిగా పనిచే స్తున్న అరుణకుమారికి పోస్టింగ్ ఇచ్చారు. కాళేశ్వరం జోన్ 1 పరిధిలో ఉమ్మడి ఆదిలాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు జిల్లాల పాఠశాలల్లో పర్యవేక్షణ అధికారిగా అరుణకుమారి బాధ్యతలు చేపట్టనున్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చేయి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 24: కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి బడ్జెట్‌లో మొండి చేయి చూపిందని ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత బడ్జెట్‌కు ఈ సారి ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు కేవలం 0.1 శాతం మాత్రమే పెంచారన్నారు. ఉన్నత విద్యాసంస్థలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాల అభివృద్ధికి నిధులు ఇచ్చే యూజీసీకి నిధులు కోత పెట్టడం సరైంది కాదన్నారు. పాఠశాల విద్యకు గత బడ్జెట్‌లో రూ. 68804 కోట్లు కేటాయిస్తే ఈ సారి 71,569 కోట్లు కేటాయించారన్నారు. విద్యారంగం అభివృద్ధికి బడ్జెట్‌ను సవరించి పెద్ద మొత్తంలో బడ్జెట్ కేటాయించాలని కోరారు.

ఏసీసీ: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి విద్యారంగానికి కేంద్రం మొండి చేయి చూపించిందని డెమోక్రటీ టీచర్స్‌ఫెడరేసన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆసంపల్లి రమేష్, మోతె జయకృష్ణలు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం 2020 ద్వారా విద్యారంగంలో మార్పులు తెస్తామని గొప్పలు చెప్పిన కేంద్ర ప్రభుత్వం విద్యా రంగానికి 2.6 శాతం మాత్రమే నిధులు కేటాయించడం నిర్లక్ష్య దోరణికి నిదర్శనమన్నారు. తగినన్ని నిధులు కేటాయించకుండా పేదలకు నాణ్యమైన విద్యను అందించడం సాధ్యం కాదన్నారు. బడ్జెట్‌తో వేతన జీవులకు ఒరిగేదేమిలేదన్నారు.

విద్యారంగానికి కేటాయింపులు తగ్గించడం శోచనీయమని తెలంగాణ విద్యార్థి ఉద్యమవేదిక కన్వీనర్ చిప్పకుర్తి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం

లక్సెట్టిపేటరూరల్, జూలై 24 : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ రంగాలకు నిధుల కేటాయింపు ఏమాత్రం లేదన్నారు. తెలంగాణలో ఇద్దరు కేంద్ర మంత్రులుగా 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి న్యాయం చేయలేకపోయారని విమర్శించారు. ప్రధాని మోదీకి ఆదాని, అంబానీలపై ఉన్న ప్రేమ రాష్ట్రంపై లేదన్నారు.

కార్యదర్శి సేవలు చిరస్మరణీయం

నెన్నెల, జూలై 24: నందులపల్లి గ్రామ కార్యదర్శి పద్మనాభం సేవలు చిరస్మరణీయమని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి అన్నారు. బదిలీపై వెళ్తున్న పద్మనాభంకు బుధవారం గ్రామస్థులు వీడ్కోలు పలికారు. పదేళ్ళుగా ప్రజల్లో మమేకమై ఈ ప్రాంతంలో సేవలందించారని అన్నారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఎంపీవో శ్రీనివాస్, మాజీ సర్పంచులు బోయిని మల్లేష్, సాగర్‌గౌడ్, బీజేపీ మండల అధ్యక్షులు శైలేందర్‌సింగ్, కాంగ్రెస్ నాయకులు గజేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల అభివృద్ధికి కృషి చేద్దాం

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 24: జిల్లాలోని ఆదివాసీ జాతుల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్య, వైద్య అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో కొనసాగుతున్న పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తామని వివరించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కనీస మౌలిక వసతులు కల్పించనున్నామని చెప్పారు. ఆదివాసీ గ్రామాలకు, మారుమూల ప్రాంతాలకు వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతామని చెప్పారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. మారుమూల గ్రామాలను జిల్లా కేంద్రానికి అనుసంధానం చేస్తూ అంతర్గత రహదారుల నిర్మాణం చేపడుతామని తెలిపారు. ఆదివాసీ నాయకులు, కుల పెద్దలు ఆదివాసీ గ్రామాలలో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం భారీ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ఆదివాసీ నాయకుల పాత్ర కీలకమైందన్నారు. గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలు, పోడు భూములపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా జరిపేందుకు ఆదివాసీ నాయకులు, కుల పెద్దల సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో అభివృద్ధికి సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ద్వారా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఎంహెచ్‌వో తుకారాం, డీడీ రమదేవి, ఆదివాసీ సంఘాల నాయకులు సిడాం అర్జు, కుర్సింగ మోతిరాం, మడావి గుణవంతరావు, ఆత్రం భీంరావు, పెందూరు సుధాకర్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఆసిఫాబాద్, జూలై 24: ప్రతి దుకాణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ సతీష్ అన్నారు. స్థానికంగా బుధవారం వ్యాపారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలను అరికట్టవచ్చన్నారు. ఏదైనా సం ఘటనలు జరిగితే నేరస్తులను తేలికగా పట్టుకోవచ్చన్నారు. జ్యువెలరీ, కిరాణ దుకాణం, ఇతర వ్యాపార సంస్థల వద్ద లోపల, బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

వాంకిడి, జూలై 24: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని హెచ్ఈఓ రవిదాస్ అన్నారు. బంబార గ్రామంలోని ట్రైబల్ వెల్ఫేర్ ఆదర్శ పాఠశాలలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సునంద, ఆశా వర్కర్ లక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు దేవరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఆసిఫాబాద్, జూలై 24: జిల్లా సమీకృత కలెక్టరేట్ పరిపాలన అధికారిగా మధుకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ బాధ్యతలు నిర్వహించి రఫతుల్లా మంచిర్యాలకు బదిలీ అయ్యారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మధుకర్ బాధ్యతలు స్వీకరించారు.

నిత్యావసరాలు అందజేత

చింతలమానేపల్లి, జూలై 24: నిరుపేద కుటుంబానికి చెందిన జాడి సంతోష్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి బుధవారం కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు తిరుపతి 50 కిలోల బియ్యం, నూనె, పప్పు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో శంకర్, మహేష్, భీమయ్య, శ్రీకాంత్, సోమాజీ తదితరులు పాల్గొన్నారు.

ఈసుగాంలో గంజాయి పట్టివేత

కాగజ్‌నగర్, జూలై 24: కాగజ్‌నగర్ మండలం విలేజీ నంబరు 8లో బుధవారం టాస్క్‌ఫోర్సు అధికారులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు అందిన సమాచారం ఈసుగాంలోని విలేజీనెం8లో దాడులు నిర్వహించగా, దిలీప్ కుమార్ మండల్‌కు చెందిన ఇంట్లో 200 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు టాస్క్‌ఫోర్సు సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్సై వెంకటేష్, పీసీలు మధు, రమేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఆసిఫాబాద్ రూరల్, జూలై 24: ఆసిఫాబాద్ తహసీల్దార్ శ్రీనివాస్ బదిలీపై వెళ్తుండడంతో బుధవారం కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీటీ పోచయ్య, ఆర్ఐలు సాయి, రహమాత్, సిబ్బంది చిన్ను, సాయితేజ, యాసిన్, మనోహర్, లక్ష్మి పాల్గొన్నారు.

సిర్పూర్(టి): ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ తప్పదని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న ముబీన్ బదిలీపై జయశంకర్ భూపాలపల్లికి వెళ్తున్న సందర్భంగా ఆయనను సన్మానించారు. కాగా ఎఫ్ఆర్వో పూర్ణచందర్‌రావు బెల్లంపల్లికి బదిలీ కాగా ఆయన స్థానంలో నీల్వాయి నుంచి ఎఫ్ఆర్వో ఎక్బాల్ హుస్సేన్ రానున్నారు. అలాగే ఏవో కృష్ణమూర్తి మంచిర్యాల జిల్లాకు బదిలీ అయ్యారు.

సైబర్ నేరాలపై అవగాహన

కెరమెరి, జూలై 24: కెరమెరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఎస్సై విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కళాబృందం సభ్యులు సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని ఎస్సై సూచించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలి

ఆసిఫాబాద్, జూలై 24: ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని టీఎమ్మార్పీఎస్ నాయకులు మల్లేష్, ధర్మయ్య కోరారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని కోరుతూ ఆగస్టు 9న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తలపెట్టిన దీక్ష కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను బుధవారం విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, వెంకటేష్, మల్లేష్ తతదితరులు పాల్గొన్నారు.

గోశాలకు తరలింపు

జైనూర్, జూలై 24: మండల కేంద్రంలో విశ్వ హిందూ పరిషత్ నాయకులు అక్రమంగా తరలిస్తున్న గోమాతను బుధవారం పట్టుకుని నార్నూరు మండలం లోని గోశాలకు తరలించారు. ఈ సందర్భంగా అఖండ విశ్వ హిందు పరిషత్ నాయకులు మాట్లాడుతూ అధికారులు పశువులు అక్రమంగా తరలించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మూడు మండలాల అఖండ విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు ఆత్రం భీంరావ్, భజరంగ్ దళ్ అధ్యక్షుడు సిందే శివరాజ్ పాటిల్, మండల అధ్యక్షుడు చాహకటి గణేశ్, ప్రధాన కార్యదర్శి రాథోడ్ ధర్మేందర్, ఉపాధ్యక్షులు రమేశ్ పుల్లారె, సుదాం, గౌట ఆకాష్ పాల్గొన్నారు.

జిల్లా బీసీ సంక్షేమాధికారిపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్, జూలై 24: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ అవకతవకలకు పాల్పడుతున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు బుధవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాయికృష్ణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత

కెరమెరి, జూలై 24: గోయగాం గ్రామ సమీపంలో ఆసిఫాబాద్- ఆదిలాబాద్ ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయం కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. బుదవారం పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది గుంతలు పూడ్చారు. గుంతల్లో మొరం పోయించి ట్రాక్టర్‌తో చదును చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి బొజ్జిరావు, సిబ్బంది హీరాజీ, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

ఆసిఫాబాద్, జూలై 24: హైదరాబాద్‌లో ఈ నెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించే ఫొటో గ్రాఫర్ల ఎక్స్పో ట్రేడ్ షోకు సంబంధించిన పోస్టర్లను బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఆసిఫాబాద్, వాంకిడి ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ సభ్యులు విడుదల చేశారు. కార్యక్రమంలో ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం నాయులు సమీర్, సతీష్, రాజు, వివేక్, అనిల్, రాజశేఖర్, లలిత్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి మొండి చేయి



కాగజ్‌నగర్‌లో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కాగజ్‌నగర్, జూలై 24: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చేయి చూపిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలె సాయికృష్ణ అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కేటాయించక పోవడాన్ని నిరసిస్తూ కాగజ్‌నగర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చేయి చూపిందన్నారు. విద్యారంగానికి నిధులు కేటాయించలేదన్నారు. గతంలో ఇచ్చిన హామీలను కూడా విస్మరించిందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నితీష్, రాజ్‌మండల్, నాందేవ్, సాయిచరణ్, జ్ఞానేశ్వర్, కార్తీక్, చిత్తరంజన్, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని చెప్పారు. ఉన్నత విద్యను అభ్యసించిన విద్యార్థులకు వడ్డీ లేని రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భీంరావు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు

సిర్పూర్(టి), జూలై 24: సిర్పూర్(టి) మండలం వెంపల్లి వాగుమీరగూడ, లోనవెల్లి, తదితర పాఠశాలల్లో బుధవారం పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీనివాసరావు, రాజు, వేణు గోపాల్‌రావు, దేవాజీ, ప్రకాష్, లక్ష్మీనారాయణ, పురుషోత్తం, జావీద్, శ్రీకాంత్, సుజాత, మాధవి, ఎస్‌వో సుధ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



ఆసిఫాబాద్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయులు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 24: జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ జడ్పీటీసీ అరుణ, నాయకులు సరస్వతీ, అలీబీన్ అహ్మద్, వెంకన్న, నిసార్,తారీక్, శైలేందర్, వెంకన్న, ఉమారాణి, తదితరులు పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రెబ్బెన: మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ సంజీవ్ కుమార్, మాజీ ఎంపీపీ సౌందర్య, శ్రీధర్, శ్రీనివాస్, వినోద్, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: బీఆర్ఎస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అజయ్‌కుమార్, తుకారాం, వినోద్, పెంటయ్య, అశోక్, అశుతోష్ పాల్గొన్నారు.

జైనూర్: మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కనక యాదవ్‌రావ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతీయాజ్‌లాల తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన రోడ్డు



కోతకు గురైన ఖర్జీ- రాంపూర్ రోడ్డు

దహెగాం, జూలై 24: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఖర్జీ-రాంపూర్ గ్రామాల మధ్య రోడ్డు కోతకు గురైంది. దీంతో ఆ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసి బురదమయంగా మారితే వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉందని ప్రజలు వాపోతు న్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని రాంపూర్, టెంపర్‌గాం, శంకరాపురం, మొట్లగూడ, రావుపల్లి, దిగిడ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



స్వీయరక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

సిర్పూర్(టి), జూలై 24: స్వీయరక్షణకు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సీఐ సాదిక్ పాషా అన్నారు. సిర్పూర్(టి) పోలీసు స్టేషన్ పరిధిలోని కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఎస్సై దీకొండ రమేశ్ ఆధ్వర్యంలో బుధవారం వ్యాపార దుకాణాల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఉండడం వల్ల నేరం చేయడానకి నేరస్తులు ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తారని తెలిపారు. ఎక్కడ నేరం చేసినా సీసీ కెమెరాల ద్వారా నేరస్తులను గుర్తు పట్టవచ్చని అన్నారు. ప్రజల రక్షణ భద్రత గురించి పోలీసులు ఎల్లవేళలా పని చేస్తున్నారని తెలిపారు.

గిరిజన బాలికలు క్రీడల్లో రాణించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



మొక్కలు నాటుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్ రూరల్, జూలై 24: గిరిజన బాలికలు క్రీడల్లో రాణించేలా సిద్ధం కావాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల క్రీడా పాఠశాలలో బుధవారం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు రమాదేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్‌తో కలిసి వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఒక్కో మొక్కను దత్తత తీసుకుని నాటి సంరక్షించాలని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన సహజవా యువు, మతుల్య వాతావరణం అందించవచ్చన్నారు. గిరిజ బాలికల పాఠశాల నుంచి జాతీయ స్థాయి పోటీలో పాల్గన్న విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు పట్టుదలతో శ్రమించి మరింత తర్ఫీదు పొంది అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, డీపీ వో ఉమర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో క్షేత్రయ్య, గిరిజన క్రీడాధికారిణి మీనారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు పాల్గొన్నారు.

- దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు పథకం ఫలాలు అందేలా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన సేవా కేంద్రాన్ని బుధవారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, డీపీవో ఉమర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించాని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులకు పథకం ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ నిర్వహణలో తలెత్తే సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

పాఠశాల నిర్వహణపై నిర్లక్ష్యం సరికాదు



పాఠశాలలో పరిసరాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా

రెబ్బెన, జూలై 24: ఆశ్రమ పాఠశాల నిర్వహణపై నిర్లక్ష్యం తగదని ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా అన్నారు. రెబ్బెన ఆశ్రమ పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయుడు సోమయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

మహిళల రక్షణే షీ టీం ప్రధాన లక్ష్యం

ఆసిఫాబాద్ రూరల్, జూలై 24: మహిళల రక్షణే షీ టీం ప్రధాన లక్ష్యమని షీ టీం ఇన్‌చార్జి వెంకటేశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని చైతన్య జూనియర్, డిగ్రీ కళాశాలలో బుధవారం జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు విద్యార్థులకు షీటీం సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు ఎవరైనా గురైనట్లయితే వెంటనే షీ టీంలను సంప్రదించాలన్నారు. బాధిత వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని వీలైనం త్వరగా న్యాయం చేకూరితందుకు పోలీసు శాఖ ప్రయత్నిస్తుందని తెలియజేశారు. ఫేస్‌బుక్, వాట్సాప్, వంటి వాటిని వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమ యంలో వ్యక్తిగత భద్రతలకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకో వాలని తెలిపారు. అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు రాణి, మమత, శ్రీనిధి, ప్రిన్సిపాల్ శ్రీనివా స్, రాజశేఖర్, సునీత, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.



లింగాపూర్‌లో బురదనీటిలో విద్యార్థుల పాట్లు



చింతలమానేపల్లిలో నాయకపుగూడ వాగు ఉధృతి



కుమరం భీం ప్రాజెక్టు గేట్లు ఎత్తిన అధికారులు

ఎడతెరిపి లేని వాన

- జిల్లా వ్యాప్తంగా 51.6 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం
- ఉప్పొంగి ప్రవహిస్తున్న పెన్‌గంగా, ప్రాణహిత
- కుమరంభీం ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తివేత
- బెజ్జూరు మండలంలో జలదిగ్బంధంలో 12 గ్రామాలు



తుమ్మిడిహెట్టి వద్ద ప్రమాదకరంగా ప్రవహిస్తున్న ప్రాణహిత నది

ఆసిఫాబాద్, జూలై 24: జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో వాగులు, ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 51.6 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 51.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బెజ్జూర్‌లో 104.4, కౌటాలలో 89.8, చింతలమానేపల్లిలో 86.4, సిర్పూర్(టి)లో 76.2, పెంచికల్‌పేటలో 62.4, దహెగాంలో 56.4 మి ల్లీమీటర్ల వర్షం కురిసింది. జైనూర్‌లో 41.2 మి.మీ, సిర్పూర్ (యూ)లో 38.0, లింగాపూర్‌లో 37.4, కాగజ్‌నగర్‌లో 36.8, ఆసిఫాబాద్‌లో 36.0, వాంకిడిలో 33.6, కెరమెరిలో 32.8, తిర్యాణిలో 17.0, రెబ్బెనలో 26.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ మండలంలో మంగళవారం రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. మండలంలోని గుండి వాగు, అప్పపల్లి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో రోడ్లన్నీ బురద మయంగా మారడంతో ప్రజలు నడవలేని పరిస్థితి నెలకొంది. కుమరం భీం, వట్టివాగు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. కుమరం భీం ప్రాజెక్టులో 3,180 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో మూడు గేట్లు పైకి ఎత్తి 3,230 క్యూసెక్కుల వరద నీటిని బయటకు వదలుతున్నారు. పెద్దవాగు పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

బెజ్జూరు: మండలంలో మంగళవారం రాత్రి నుంచి తెరి ఇవ్వకుండా ముసురు వాన కురుస్తోంది. దీంతో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు అక్కడి ప్రాజెక్టుల నీటిని వదిలి పెట్టడంతో ప్రాణహిత నదికి వరద పోటెత్తి మండలంలో 12 గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. సోమిని-కుశ్నపల్లి, తలాయి- సోమిని, తలాయి- పాన్నపేట గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై ప్రాణహిత బ్యాక్ వాటర్ ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. తలాయి- సోమిని గ్రామాల మధ్య వంతెన ఇప్పటికే వరద నీటిలో మునిగి పోవడంతో రాకపోకలు అంత రాయం కలుగుతోంది. దీంతో వాగు అవతల ఉన్న సుస్మీర్, సోమిని, మొగవెల్లి, పాత సోమిని, ఇప్పల గూడ, నాగెపల్లి, బండలగూడ, గెర్రెగూడ, తలాయి, తిక్కపల్లి, భీమారం, పాత మొగవెల్లి ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో పంట పొలాలు మునిగి పోవడంతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. అత్యవసర సమయాల్లో బయటకు రావాలంటే వరద నీటిలో నాటు పడవలపై ప్రయాణం చేయాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చింతలమానేపల్లి: వర్షాలతో కేతిని-దిండా గ్రామాల మధ్య వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో దిండా గ్రామ ప్రజలకు రాకపోకలు నిలిచి పోయాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆ గ్రామానికి వాహనం కూడా వెళ్లే పరిస్థితి లేక పోవడంతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. బాబాసాగర్, నాయకపుగూడ వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. బాబా సాగర్, అర్కగూడ ప్రాజెక్టు మత్తడి నుంచి వరద నీరు దూకుతుంది. శివపల్ల మధ్యలో ఉన్న ఒర్రె ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పంట భూములు పూర్తిగా జలమయం కావడంతో దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో గల గూడెం ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

పెంచికలపేట: వర్షాలకు పెద్దవాగు, ఉచ్చమల్లివాగు, బొక్కివాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లోడ్‌పల్లి- పెంచికలపేట ప్రధాన రహదారి వరద ఉధృతికి కోతకు గురైంది. గుంట్లపేట గ్రామ ప్రధాన రహదారి బురద మయంగా మారిపోయింది. అంతర్గత రోడ్లపై వర్షపునీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కాగజ్‌నగర్: పట్టణంలో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షం నీరు వచ్చింది. పలు కాలనీల్లో ఉన్న అంతర్గత రోడ్లు బురదమయమయ్యాయి. ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో చిరువ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. అందవెల్లి, భట్టుపల్లి గ్రామాల మధ్య రోడ్డుపై గుంతలు పడడంతో వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.


లింగాపూర్: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పిట్టగూడ వాగు, మెత్తిపట్టార్ వాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల లోలెవల్ వంతెనలపై నుంచి వరద నీరు వెళుతోంది. మండల కేంద్రంలోని పాఠశాలకు వెళ్లే విద్యార్థులు లోలెవల్ వంతెనపై వరదనీటి నుంచే రాకపోకలు సాగుస్తూ ఇబ్బందులు పడుతున్నారు.

జైనూర్: వర్షాలకు ఒర్రెలు పొంగి ప్రవహిస్తుండడంతో లొద్దిగూడ, చిత్తకర్ర, తాడిలొద్ది తదితర గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. అంతర్గత రోడ్లు బురదగా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. భారీ వర్షం, ఈదురుగాలులకు విహికర్ సెక్షన్ కాలనీ లోని మేస్రాం శేషనారాయణ అనే వ్యక్తి ఇంటిపై చెట్టు విరిగిపడింది.

సిర్పూర్(టి): మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వ ర్షాలకు పంట పొలాల్లో భారీగా వరద నీరు చేరింది. అలాగే కొన్ని గ్రామాల్లో అంతర్గత రోడ్లతో పాటు ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి. మండల సరహద్దుల్లో పెన్‌గంగా ఉధృతంగా ప్రవహిస్తోంది.

దహెగాం: మండలంలో ఒర్రెలు, చెరువులు పొంగి పొర్లుతున్నాయి. దహెగాం మండల కేంద్రంలో దాసరి ఎల్లమ్మ అనే వృద్ధురాలి ఇంటి గోడ రాత్రి వర్షానికి కూలి పోయింది.

కౌటాల: మండలంలో కురుస్తున్న వర్షానికి తోడు మహారాష్ట్ర నుంచి వరదనీరు రావడంతో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత వరద ఉధృతి పెరిగింది. ఎడ తెరిపి లేని వర్షంతో పంటల పొలాలు జలమయం అయ్యాయి. అంతర్గత రోడ్లపై వర్షపునీరు నిలిచి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాణహిత నది



సుస్మీర్‌లో లోలెవల్ వంతెనపై ప్రవహిస్తున్న వాగు



పెంచికలపేటలో కోతకు గురైన లోడ్‌పల్లి రోడ్డు

హోంగార్డుల సేవలు అభినందనీయం

- దర్బార్‌లో ఎస్పీ డీవీ శ్రీనివాస్

ఆసిఫాబాద్, జూలై 24: హోంగార్డుల సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం హోంగార్డ్ అధికారులు దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్, ఎఆర్ వంటి ప్రధాన విభాగాలలో హోంగార్డు అధికారులు సమర్థవంతంగా పని చేస్తున్నారని చెప్పారు. ఎన్నో సమస్యాత్మక పరిస్థితుల్లో ఘర్షణల నివారణలో పండుగల బందో బస్తు, ఎన్నికల బందో బస్తు, గణేశ్ నిమజ్జన ఊరేగింపు వంటి విధుల నిర్వహణలో వీరి కృషి ఎంతో ఉందని అభినందించారు. ఏడాదికి 12 వేతనంతో కూడిన లీవ్‌లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఒక వ్యక్తి యొక్క హోదా, ఉన్నతితో అతడికి గౌరవం లభించదన్నారు. తెలంగాణ పోలీసు వ్యవస్థలో పై స్థాయి అధికారుల నుంచి కింది స్థాయి అధికారుల వరకు ఒకే విధమైన నియమాలు ఉంటాయని తెలిపారు. సిబ్బంది పని తీరుతో పాటు ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని దృష్టిలో ఉంచుకుని విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ రాణా ప్రతాప్, ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, ఆర్ఐ ఎంటీఓ అంజన్న, ఆర్ఐ హోంగార్డు ఇన్‌చార్జి భరత్ భూషణ్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలు ఏకాగ్రతతో నడపాలి

ఆసిఫాబాద్, జూలై 24: వాహనాలు ఏకాగ్రతతో నడిపి ప్రమాదాల నివారణకు పాటు పడాలని జిల్లా రవాణాధికారి రాంచందర్ అన్నారు. బుధవారం ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రత వారోత్సవాల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డ్రైవర్లు వాహనాలను జాగ్రత్తగా నడపాలన్నారు. డిపో మేనేజర్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఆసి ఫాబాద్ డిపోను ప్రమాద రహిత డిపోగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు శ్రీనివాస్, సరియా, ఉదయ్ పాల్గొన్నారు.



సింగరేణితో ఉజ్వల భవిత



కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్, జూలై 24: సింగరేణి సంస్థలో పనిచేస్తే ఉజ్వల భవిత ఉంటుందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. కారుణ్య విధానంలో ఉద్యోగాలు పొందిన ఏడుగురికి జీఎం కార్యాలయంలో బుధవారం నియామక పత్రాలు అందించి మాట్లాడారు. క్రమ శిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. సింగరేణి లాభాల బాటలో పయణించాలంటే ఏ పని కేటాయించినా నిబద్ధతతో పనిచేయాలన్నారు. మొదటి తరం ఉద్యోగులకు చాలా కష్టమైన పనులు ఉండేవని, ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, పర్సనల్ మేనేజర్, సీనియర్ పీవో వి.కాంతారావు, పిట్ కార్యదర్శి రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు అభ్యర్థులకు రాత పరీక్షలు

శ్రీరాంపూర్, జూలై 24: శ్రీరాంపూర్ సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వివిధ వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు గురువారం రాత పరీక్ష నిర్వహించనున్నట్లు డీజీఎం(పర్సనల్) పి. అరవిందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వృత్తి శిక్షణ కోర్సులను 477 మంది నేర్చుకున్నారని పేర్కొన్నారు. వారంతా నస్పూర్‌లోని సేవాభవన్, శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఉదయం నిర్వహించే పరీక్షలకు హాజరు కావాలని కోరారు.

కార్మికుల రక్షణకే పెద్దపీట

- ప్రమాదాలు జరుగకుండా చూడాలి
- కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య



సేఫ్టీ జీఎం గురువయ్యను సన్మానిస్తున్న జీఎం మనోహర్

మందమర్రిటౌన్, జూలై 24: కార్మికుల రక్షణతో పాటు ఆరోగ్యానికి యాజమాన్యం పెద్దపీట వేస్తుందని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య అన్నారు. మందమర్రి జీఎం కార్యాలయంలో బుధవారం అధికారులతో ఆయన మాట్లాడుతూ కార్మికులు విధిగా ప్రతిరోజు రక్షణ సూత్రాలు పాటిస్తూ విధులు చేసేలా అధికారులు చూడాలన్నారు. రక్షణ సూత్రాలు పాటించడం ద్వారా ప్రమాదాలు జరగవన్నారు. రక్షణపై కార్మికులకు అవగాహన పెరిగిందని, కొన్ని కొన్ని సందర్భాల్లో మర్చిపోతుంటారని చెప్పారు. అధికారులు రక్షణ సూత్రాలు పాటించేలా చూడాలన్నారు. ప్రతీ కార్మికుడి ఆరోగ్యం కోసం పరీక్షలు నిర్వహిస్తుందని తెలిపారు. ద్విచక్రవాహనాలు నడిపే కార్మికులు హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో మందమర్రి జీఎం మనోహర్, ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, ఐఈడీ రాజన్న,పీఎం శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్యను జీఎం కార్యాలయంలో జీఎం మనోహర్, అధికారులు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. జీఎం మాట్లాడుతూ కార్మికుల రక్షణకు గురువయ్య పకడ్బందీ చర్యలు చేపట్టారని అభినందించారు.

రక్షణ జీఎంకు ఘన సన్మానం

శ్రీరాంపూర్, జూలై 24: జనరల్ మేనేజర్(రక్షణ- కార్పొరేట్)గా పనిచేస్తూ ఈ నెల చివరలో ఉద్యోగ విరమణ పొందనున్న గురువయ్యను శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి. సంజీవరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్(రక్షణ) రఘుకుమార్, ఇన్‌చార్జి ఎస్‌ఓ టు జీఎం గోపాల్‌సింగ్, ఇందారం ఓసీపీ పీవో ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ చొరవతోనే ప్రమాద బీమా

మందమర్రిటౌన్, జూలై 24: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు రూ.30 లక్షల ప్రమాద బీమా తమ యూనియన్ అధ్యక్షుడు సీతారామయ్య చొరవతోనే జరిగిందని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ అధ్యక్షుడు జెట్టి మల్లయ్య తెలిపారు. మందమర్రిలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో నాయకులు సత్యనారాయణ, ప్రభాకర్, రాజ్‌కుమార్, రాజేష్ యాదవ్, కిషన్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి యాజమాన్యం కృషి

మందమర్రిటౌన్, జూలై 24: మహిళల సంక్షేమానికి యాజమాన్యం కృషి చేస్తుందని మందమర్రి జీఎం మనోహర్ తెలిపారు. స్థానిక సీఈఆర్ క్లబ్‌లో బుధవారం బ్యూటిషియన్, మగ్గం వర్కు, ఫ్యాషన్ డిజైనింగ్ , టైలరింగ్, కంప్యూటర్ కోర్సులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం ఒక సామాజిక బాధ్యతతో కార్మిక, కార్మికేతర మహిళల స్వయం ఉపాధి కోసం ప్రతి సంవత్సరం వృత్తి శిక్షణ కోర్సులను ప్రవేశపెడుతుందన్నారు. మహిళలు వీటిని సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని చెప్పారు. ఇప్పటి వరకు వేలాది మంది మహిళలకు శిక్షణ అందించి సర్టిఫికెట్లు అందజేశామని తెలిపారు. ఇప్పుడు వారు సొంతంగా ఉపాధి ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారన్నారు. సేవా సమితి అధ్యక్షురాలు సవితమనోహర్ మాట్లాడుతూ మహిళ సాధికారత , స్వయం ఉపాధి కోసం సేవా సమితి కృషి చేస్తుందన్నారు. యాజమాన్యం మహిళల ఆర్థిక ప్రగతికి దోహదం చేస్తుందన్నారు. గతంలో శిక్షణ పొందిన 187 మందికి సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో పీఎం శ్యాంసుందర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేశ్, డీవైపీఎం ఆసీఫ్, రీజనల్ ఆఫీసర్ అనసూయ, ఖాదీ బోర్డు సింగరేణి కో ఆర్డినేటర్ శివకుమార్ , నరేష్, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

ప్లేడే పరిధిని పెంచాలి

మందమర్రిటౌన్, జూలై 24: ఏరియా వర్కుషాపులో పనిచేస్తున్న కార్మికుల ప్లేడే పరిధిని పెంచాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్య దర్శి సలేంద్ర సత్యనారాయణ, కార్యదర్శి భీమనాధుని సుదర్శన్ కోరారు. ఏరియా వర్కు షాపులో బుధవారం కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ గ్యారేజీ సెక్షన్ ముందు నీరు నిల్వ ఉండడం వల్ల కార్మికులు జారిపడే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో శర్మ, రాజేశం, వెంకటేశ్వర్లు, భూమయ్య, లక్ష్మణ్, వెంకట్రావు, శ్రీనివాస్, పోశాలు , జయంత్, కిరణ్, రాజశేఖర్, రాజేందర్, రమేశ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.